నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 కరీంనగర్, సోమవారం 9 జూన్ 2025 KARIMNAGAR

## మానేరుపై బ్రిడ్జి నిర్మించండి

**మైలారం మైసమ్మ గుట్ట వద్ద జేఏసీ నాయకుల నిరసన**



నిరసన తెలుపుతున్న బ్రిడ్జి జేఏసీ నాయకులు

గన్నేరువరం, జూన్8: మానేరువాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని బ్రిడ్జి జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేకు ఆదివారం జేఏసీ చైర్మన్ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో గన్నేరువరం మండలం మైలారంలో వంటావార్పు చేశారు. గ్రామంలోని మైసమ్మ గుట్ట వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, జిల్లా కేంద్రం కంటికి దగ్గరగా, కాలుకు దూరంగా మారిందని వాపోయారు. బ్రిడ్జి నిర్మిస్తే గన్నేరువరం, ఇల్లంతకుంట, బెజ్జంకి మండలాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఎన్నికల సమయంలో వాగ్దానాలు ఇచ్చిన నాయకులంతా బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బ్రిడ్జి జేఏసీ నాయకులు బామండ్ల రవీందర్, వరాల సతీశ్, విలసాగర్రామచంద్రం, రేపాక బాబు, ప్రశాంత్ యాదవ్, నూకల చింటూ, బొడభాస్కర్ రెడ్డి, చెన్నాడి మధుసూదన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



రంగంపల్లిలోని ఓ రేషన్ దుకాణం ఎదుట బియ్యం కోసం వరుస క్రమంలో పెట్టిన సంచులు

## రేషన్ కోసం పడిగాపులు

పెద్దపల్లి, జూన్ 8: రేషన్ కోసం పేదలు పరేషాన్ అవుతున్నారు. ప్రభుత్వం మూడు నెలల బియ్యం ఒకేసారి అందిస్తుండడం, ఒక్కో లబ్ధిదారుడు ఆరుసార్లు బయోమెట్రిక్ నమోదు చేయాల్సి రావడంతో రోజంతా వేచిచూస్తున్నారు. పెద్దపల్లి పట్టణం రంగంపల్లిలోని ఓ రేషన్ డీలర్ టోకెన్ విధానాన్ని అమలు చేసినా నిరీక్షణ తప్పలేదు. ఆదివారం ఉదయం 6 గంటలకే దుకాణానికి వచ్చి క్యూ కట్టినప్పటికీ ప్రక్రియ ఆలస్యంగానే జరుగడంతో నిలబడే ఓపిక లేక సంచులు లైన్‌లో పెట్టారు. టోకెన్‌తో ప్రయోజనం లేదని, బియ్యం పోసే దాకా షాపు వద్ద ఉండుడే కదా..? అని లబ్ధిదారులు వాపోయారు.

## రాజన్న గోశాలలో గడ్డి స్కాం

**కోడెలకు గడ్డిపెట్టకుండా నెలకు ₹5లక్షల అవినీతి**



తిప్పాపూర్ గోశాలలో చికిత్స పొందుతున్న కోడెలను వైద్యులతో కలిసి పరిశీలిస్తున్న బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, నాయకులు

- కడుపునిండా ఆహారం పెట్టలేని దుస్థితిలో ప్రభుత్వం
- కోడెల మృతిలో ప్రథమ ముద్దాయి మంత్రి కొండా సురేఖనే
- ఆమె నిర్వాకం వల్లే పంపిణీ ఆరు నెలల నుంచి నిలిచింది
- బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గం ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ధ్వజం
- తిప్పాపూర్‌లోని రాజన్న గోశాల పరిశీలన

వేములవాడ, జూన్ 8 : వేములవాడ రాజన్న ఆలయ గోశాలలో గడ్డి స్కాం జరిగిందని, కోడెలకు గడ్డి వేయకుండా ప్రతి నెలా దాదాపు ₹5 లక్షల అవినీతికి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆరోపించారు. కోడెలకు కనీసం కడుపునిండా తిండి పెట్టని దుస్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. రాజన్న భక్తుల విశ్వాసానికి, నమ్మకానికి ప్రతీకైన కోడెలు మృత్యువాత పడడంలో ప్రథమ ముద్దాయి మంత్రి సురేఖనేనని తీవ్ర ఆరోపణలు చేశారు. రాజన్న ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాలలో అధికారిక లెక్కల ప్రకారం 33 కోడెలు మృతిచెందగా, ఆదివారం ఆయన నాయకులతో కలిసి పరిశీలించారు. కోడెల పరిస్థితిని చూసి చలించిపోయారు. అందుకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖనే కారణమని తీవ్ర విమర్శలు చేశారు. కలెక్టర్ కన్వీనర్‌గా ఉండి ఒక్కో రైతుకు రెండు కోడెలను మాత్రమే ఇవ్వాలన్న నిబంధనలను మంత్రి తుంగలో తొక్కారని మండిపడ్డారు. తన సిఫారసు లేఖ ద్వారా అధికారులపై ఒత్తిడి తెచ్చి గీసుకొండకు చెందిన రాంబాబుకు అక్రమ పద్ధతిలో 60 కోడెలను ఇచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. అందులో 49 కోడెలు మాయం కావడంతో గీసుకొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై రాంబాబు జైలుకు వెళ్లిన విషయంపై మీడియాలో కథనాలు వచ్చాయని చెప్పారు. దాంతో డిసెంబర్ నుంచి కోడెల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయిందని, రాజన్న గోశాలలో 500 ఉండాల్సిన చోట 1300 ఉన్నాయన్నారు. ఇక్కడ అసలైన రాజకీయం ఎవరు చేస్తున్నారో ఆలోచించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అవగాహన లేకుండా కోడెలు లంపి స్కిన్‌తో చనిపోతున్నాయని చెప్పడం ఆయనకున్న శ్రద్ధ ఏమిటో తెలిసిపోయిందని ఎద్దేవా చేశారు. సాక్షాత్తూ పశు వైద్యాధికారులే సరైన పోషకాహారం అందక చనిపోతున్నాయని వెల్లడిస్తున్నా కనీస వివరాలు తెలుసుకోకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. అసలు గోశాలలో కోడెలకు గడ్డి వేయకుండా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. రోజుకు 10 టన్నుల చొప్పున గడ్డిని అందించేందుకు టెండర్ ప్రక్రియ నిర్వహించారని, పది టన్నుల గడ్డిని అందించాలనే కనీసం 25 ఎకరాల్లో పచ్చి గడ్డి వేసి ఉండాలని చెప్పారు. కానీ, సదరు కాంట్రాక్టర్‌కు 8 ఎకరాల వరకే ఉన్నట్టు తనకు సమాచారం ఉందని, అందులో ప్రతిరోజూ కేవలం రెండు టన్నులు మాత్రమే పచ్చి గడ్డి తెస్తున్నారని, మిగతా ఎనిమిది టన్నులు కాగితాల్లోనే చూపుతున్నారని ఆరోపించారు. రోజుకు ₹16 వేల చొప్పున నెలకు దాదాపు ₹5 లక్షల వరకు స్కాం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కోడెల మృతి, గడ్డి స్కాంపై విచారణ జరపించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, న్యాలకొండ రాఘవరెడ్డి, మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతి కుమార్, పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు గోస్కుల రవి, నాయకులు పొలాస నరేందర్, రామతీర్థపు రాజు, జోగిని శంకర్, నరాల శేఖర్, నిమ్మశెట్టి విజయ్, ముద్రకోల వెంకటేశం, బూరబాబు, వెంగళ శ్రీకాంత్ గౌడ్, వెంకట్ రెడ్డి, మల్లేశం, సత్యనారాయణ రెడ్డి, తదితరులు ఉన్నారు.

### అభివృద్ధిపై గత నమూనాల కథనాలే ప్రచారం

వందల కోట్ల రూపాయలతో వేములవాడ పట్టణాన్ని అభివృద్ధి పథంలో నిలిపింది తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆరే. ఇది మంత్రి సురేఖకు తెలియకపోవడం దురదృష్టకరం. ఇప్పుడు చేపట్టే విస్తరణ స్థలం కూడా గత ప్రభుత్వం సేకరించినదే. ఆమెకు ఇది కూడా తెలవకపోవడం విడ్డూరం. రాజన్న ఆలయ అభివృద్ధి కోసం గత ప్రభుత్వం రూపొందించిన నమూనాలు, అంచనాలతో కూడిన చిత్రాలు పత్రికల్లో వస్తున్నాయి. వాటినే కాంగ్రెస్ ప్రభుత్వం సోషల్ మీడియాలో అభివృద్ధి అని ప్రచారం చేసుకుంటున్నది. కనీసం ఇప్పటివరకు డీపీఆర్, నమూనాలను కూడా రూపొందించలేదు. మీడియాలో వస్తున్న కథనాలను తాము చేయబోతున్నట్టుగా ప్రచారం చేసుకోవడం విడ్డూరం. మరి ఇలానే కొనసాగుతాయా.. లేవా? అనేది కూడా వెల్లడించాలి.

\- చల్మెడ లక్ష్మీనరసింహారావు

### ఆలయం మూసివేస్తామని ఆగం చేశారు

హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ వేదికగా సమావేశం నిర్వహించి జూన్ 15 నుంచి రాజన్న ఆలయాన్ని బంద్ చేస్తామని ప్రకటించి భక్తులను ఆగం చేశారు. ఆలయం మూసివేస్తారన్న నేపథ్యంలో స్వామివారిని దర్శించుకునేందుకు నిత్యం 20వేల నుంచి 30వేల మంది భక్తులు దర్శనానికి వస్తున్నారు. కానీ, కనీస వసతి సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. భక్తులు గంటల తరబడి నిరీక్షించి క్యూ లైన్‌లో పడిపోతున్న పట్టించుకోవడంలేదు. రద్దీకి తగినట్టు సౌకర్యాలు కల్పించాలి.

\- చల్మెడ లక్ష్మీనరసింహారావు



షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, మీనాక్షి చౌదరి

## కరీంనగర్‌లో మీనాక్షి సందడి

- కవిత వెడ్డింగ్‌మాల్‌కు ప్రారంభోత్సవం

కరీంనగర్ విద్యానగర్, జూన్ 8 : వర్ధమాన నటి, హీరోయిన్, 'సంక్రాంతికి వస్తున్నాం' ఫేం మీనాక్షి చౌదరి ఆదివారం కరీంనగర్‌లో సందడి చేశారు. ఉస్మాన్‌పుర (గర్ల్స్ కాలేజీ రోడ్)లో కవిత వెడ్డింగ్ మాల్ సెకండ్ బ్రాంచ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, మాల్ అన్ని వర్గాలను ఆకట్టుకునేలా ఉందన్నారు. మీనాక్షి చౌదరి మాట్లాడుతూ, కవిత వెడ్డింగ్ మాల్‌లో వస్త్రాలు బాగున్నాయని, అందరికీ అందుబాటు ధరల్లో ఉన్నాయని చెప్పారు. అంతకుముందు షాపు ఎదుట అభిమానులకు అభివాదం చేశారు. డ్యాన్స్ చేసి ఆకట్టుకున్నారు. కరీంనగర్ ప్రజల అభిమానం ఎప్పటికీ మరిచిపోలేనిదని చెప్పారు.





## పునర్విభజన.. గందరగోళం

- డివిజన్లలో కలవని మ్యాపింగ్.. ఇంటి నంబర్లు
- అభ్యంతరాల పరిశీలనలో అధికారులు

కార్పొరేషన్, జూన్ 8: కరీంనగర్ నగరపాలక సంస్థలో చేపట్టిన డివిజన్ల పునర్విభజన గందరగోళంగా మారింది. ముసాయిదాలో కొన్ని డివిజన్లల్లో ఓట్లు ఎక్కువగా, మరికొన్ని డివిజన్లల్లో తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. నగరపాలక టౌన్ ప్లానింగ్ అధికారులు ఇచ్చిన మ్యాపింగ్ సరిహద్దులకు, రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఇంటి నంబర్ల సరిహద్దులకు ఎక్కడా పొంతన లేకపోవడం పెద్ద సమస్యగా మారిపోయింది. ఏ డివిజన్ పరిధి ఎక్కడి వరకు ఉంటుందో..? తెలియని పరిస్థితి నెలకొన్నది. అయితే ఇరు విభాగాల మధ్య సమన్వయం లేకపోవడమే ఇందుకు కారణంగా కనిపిస్తున్నది. అనేక డివిజన్లల్లో ఇంటి నంబర్ల కేటాయింపు గజిబిజీగా ఉండడంతో సరిహద్దులు నిర్ణయించడంలో తీవ్ర సమస్యలు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం డివిజన్ల పునర్విభజనను రెవెన్యూ డివిజన్ల ఆధారంగా చేసుకొని ముసాయిదాను తయారు చేశారు. అయితే కొన్ని రెవెన్యూ డివిజన్ల ఇంటి నంబర్ సీరిస్‌ల పక్కనే మరో ఇంటి నంబర్ సిరీస్‌లు రావడం, ఒకే ఇంటి నంబర్‌పై అనేక బై నంబర్స్‌తో ఇండ్లు ఉండడంతో ఆయాచోట్ల ఓటర్ల సంఖ్య భారీగా పెరిగినట్లు తెలుస్తోంది. దీనిపై అన్ని పార్టీల నేతల నుంచి తీవ్ర స్థాయిలో అభ్యంతరాలు వస్తుండగా, నగరపాలక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. అయితే ఇంటి నంబర్ల తీరు అధికారులకు సరికొత్త సవాళ్లను తీసుకువస్తున్నట్లు సమాచారం. పలు డివిజన్లల్లో ఒకే ఇంటి నంబర్‌పై పది, పదిహేను ఇళ్ల బై నంబర్స్ ఉండడం వాటిల్లో పెద్ద సంఖ్యలోనే ఓటర్లు ఉండడంతో ఎలా సర్ధుబాటు చేయాలన్న విషయంలో మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా డివిజన్ల పునర్విభజన ప్రక్రియలో తుది జాబితా నాటికి భారీగా మార్పులు చేర్పులు కనిపించే అవకాశాలున్నాయి.



బొమ్మగాని తిరుపతి (ఫైల్)

## షేవింగ్ ట్రిమ్మర్ చార్జింగ్ పెడుతూ..

**షాక్‌తో ముంజంపల్లిలో యువకుడి మృతి**

పాలకుర్తి, జూన్8: షేవింగ్ ట్రిమ్మర్‌కు చార్జింగ్ పెడుతూ విద్యుత్ షాక్‌తో యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. ఎండపల్లి మండలం ముంజంపల్లి గ్రామానికి చెందిన బొమ్మగాని తిరుపతి(32) ఉపాధి హామీ మేట్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం తన కొడుకుకు కటింగ్ చేసేందుకు గానూ షేవింగ్ ట్రిమ్మర్‌కు చార్జింగ్ పెడుతుండగా, ప్రమాదవశాత్తూ షాక్ తగిలి కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే కరీంనగర్ దవాఖానకు తరలించగా అప్పటికే చనిపోయాడు. తిరుపతికి భార్య రేణుక, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రేణుక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు.

## హత్య చేసి.. పూడ్చిపెట్టి

- కొండగట్టులో యువకుడి దారుణ హత్య
- మద్యం మత్తులో గొడవపడి పలువురి ఘాతుకం
- ఐదురోజుల తర్వాత వెలుగులోకి ఘటన
- ఒకరు అదుపులోకి.. మృతదేహం వెలికితీత
- మల్యాల పోలీసుల దర్యాప్తు



రమణారెడ్డి (ఫైల్)

మల్యాల, జూన్ 8: మద్యం మత్తులో గొడపడి ఓ యువకుడిని హత్య చేశారు. ఆపై ఎవరికీ తెలియకుండా ఉండేందుకు పూడ్చిపెట్టారు. చివరకు హతుడి అన్న ఫిర్యాదుతో ఐదు రోజుల తర్వాత ఈ విషయం వెలుగులోకి వచ్చింది. మల్యాల సీఐ నీలం రవి వివరాల ప్రకారం.. ముత్యంపేటకు అనుబంధంగా ఉన్న కొండగట్టు దిగువ ప్రాంతానికి చెందిన ఉప్పు నిరంజన్‌రెడ్డి తన తమ్ముడు రమణారెడ్డి (30) కనిపించడం లేదని, ఇటీవల కొంతమంది యువకులు గొడవపడి తీవ్రంగా కొట్టినట్టు తెలిసిందని శనివారం మల్యాల పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు విచారణ చేపట్టి, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా రమణారెడ్డితో కొంతమంది యువకులు గొడవ పడింది నిజమేనని గుర్తించారు. ఈ గొడవలో ఉన్న ఈశ్వర్ అనే యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించారు. తనతో పాటు కొంతమంది కలిసి మద్యం మత్తులో రమణారెడ్డిపై దాడులు చేశామని, విచక్షణ కోల్పోయి హత్య చేసినట్టు వివరించాడు. విషయం ఎవరికీ తెలియకుండా హత్య చేసిన వెంటనే అదే రాత్రి కొండపైకి వెళ్లే మెట్లదారి పక్కన కాంటూర్ కందకంలో మృతదేహాన్ని పూడ్చినట్టు చెప్పాడు. ఈ క్రమంలో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసి, శవ పంచనామా నిమిత్తం తహసీల్దార్ కోట వసంతకు సమాచారం ఇచ్చారు. ఆదివారం కావడంతో నాయబ్ తహసీల్దార్ నీతా, గిర్దావర్ తిరుపతి, మల్యాల ఎస్ఐ నరేశ్‌కుమార్, కొడిమ్యాల ఎస్ఐ సందీప్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. రమణారెడ్డి కుటుంబ సభ్యులు, నిందితుడు ఈశ్వర్ సమక్షంలో పూడ్చిన చోట తవ్వి మృతదేహాన్ని వెలికితీశారు. పంచనామా చేసి, ప్రభుత్వ వైద్యుల సమక్షంలో పోస్ట్‌మార్టం చేయించి కుటుంబ సభ్యులకు అందించినట్టు సీఐ తెలిపారు. మరో రెండు రోజుల్లో పూర్తి దర్యాప్తు జరిపి, ఈ కేసులో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రమేయం ఉన్న వారిని గుర్తించి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. కాగా, హత్య జరిగిన ఐదు రోజుల తర్వాత విషయం బయటికి రావడం స్థానికంగా కలకలం రేపింది.

## గోపీనాథ్ మరణం తీరని లోటు

**బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు**

జగిత్యాల, జూన్ 8 : జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం బీఆర్ఎస్‌కు తీరని లోటని ఆ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు విచారం వ్యక్తం చేశారు. తన రాజకీయ జీవితంలో అంచలంచెలుగా ఎదిగారని, ప్రజలకు ఎన్నో సేవలందించారని గుర్తు చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గోపినాథ్ మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## మాగంటి మృతిపై దిగ్భ్రాంతి

**చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

గంగాధర, జూన్ 8 : జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంపై చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతికి సంతాపం ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గోపీనాథ్ మరణం బీఆర్ఎస్‌కు తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సౌమ్యుడిగా, ప్రజానేతగా పేరు సంపాదించుకున్న ఆయన రాజకీయాల్లో అంచలంచెలుగా ఎదిగారని, శాసనసభ్యుడిగా నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలు చేశారని గుర్తు చేశారు. గోపీనాథ్ హైదరాబాద్ మహానగరంలో నాయకుడిగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని చెప్పారు. గోపీనాథ్‌ను కాపాడడానికి చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## మృగశిర.. చేపల కూర



చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

జగిత్యాల, జూన్ 8 : మృగశిర కార్తె ప్రారంభం కావడంతో ఇంటింటా చేపల పులుసు మసిలింది. కార్తె మొదటి రోజు చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని చాలా మంది భావిస్తుండడంతో ఆదివారం షిఫ్ మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. మత్స్యకారులు మార్కెట్‌లో మాత్రమే కాకుండా చెరువులు, రోడ్ల వెంబడి విక్రయించడంతో జనం ఎగబడి కొనుగోలు చేశారు. రవ్వులు ₹200 వరకు, బొమ్మె రకం ₹500 వరకు విక్రయించారు.






## గ్వాలియర్ వీక్లీకి పెద్దపల్లిలో స్టాప్ ఏది?

- త్వరలోనే ప్రారంభంకానున్న ఎక్స్‌ప్రెస్
- అధిక ఆదాయం ఇచ్చే పెద్దపల్లి, రామగుండం స్టేషన్లలో హాల్టింగ్‌కు నో
- పట్టించుకోని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ
- ప్రయాణికుల అసహనం

పెద్దపల్లి, జూన్ 8 (నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే కొత్తగా ప్రారంభించబోతున్న గ్వాలియర్ 11085/86వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలుకు పెద్దపల్లి, రామగుండం రైల్వే స్టేషన్లలో స్టాప్ అవకాశం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ ఎక్స్‌ప్రెస్‌ను ఎగువ ప్రయాణంలో గ్వాలియర్ టూ బెంగళూర్, దిగువ ప్రయాణంలో బెంగళూర్ ఎస్ఎంవీటీ టూ గ్వాలియర్ దాకా నడిపించనున్నట్టు గత నెల 28న రైల్వే బోర్డ్ డైరెక్టర్ ప్రకటించి, ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఇది గ్వాలియర్, గుణ, బైన, భోపాల్, జుజార్‌పూర్, నాగ్‌పూర్, మహారాష్ట్రలోని బల్లార్షా, తెలంగాణలోని కాచీగూడ, ఆంధ్రప్రదేశ్‌లోని ధర్మవరం, బెంగుళూరులోని ఎస్ఎంవీటీ స్టాప్‌లకు సదుపాయం కల్పించారు. అలాగే కమర్షియల్‌గా శివపురి, గుణ, అశోక్‌నగర్, బైన, విదిశ, భోపాల్, బేతుల్, నాగ్‌పూర్, సేవాగ్రాం, చంద్రాపూర్, బల్లార్షా, సిర్‌పూర్‌కాగజ్‌నగర్, బెల్లంపల్లి, ఖాజీపేట్, కాచిగూడ, మహబూబ్‌నగర్, గద్వాల్, కర్నూల్ సిటీ, డోన్, అనంతపూర్, ధర్మవరం, హిందూపూర్, ఎలహంకలకు స్టాప్‌లు ఇచ్చారు. కానీ, పెద్దపల్లి, రామగుండం రైల్వే జంక్షన్లలో స్టాప్ ఇవ్వలేదు. పెద్దపల్లి జిల్లాగా ఆవిర్భవించి దాపుగా పదేండ్లు కావస్తున్నా, లోక్‌సభ నియోజకవర్గ ప్రధాన కేంద్రంగా ఉన్నా, పెద్దపల్లి జంక్షన్ ఆదాయంలో ముందున్నా తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి జంక్షన్‌ను నాన్-సబ్అర్బన్ గ్రేడ్(ఎన్ఎస్‌జీ) -5 నుంచి ఎన్ఎస్‌జీ-4కి ఉన్నతీకరించినా పట్టించుకోవడం లేదని, ఇతర జోన్ల రైళ్లకు స్టాప్ ఇవ్వడం లేదన్నారు. ఆదాయం, రద్దీ తక్కువ ఉన్న స్టేషన్లకు హాల్టింగ్ ఇస్తున్నా పెద్దపల్లికి ఎందుకివ్వడం లేదని ప్రశ్నిస్తున్నారు. రైల్వేలో పెద్దపల్లి జిల్లాకు తీరని అన్యాయం జరుగుతున్నా ఎంపీ గడ్డం వంశీకృష్ణ పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. రైల్వేకు సంబంధించి పెద్దపల్లి, రామగుండం జంక్షన్లలో కనీస సౌకర్యాలు లేకపోవడం, రైళ్ల నిలుపుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పెద్దపల్లి ఎంపీ చొరవ చూపాలని కోరుతున్నారు. పెద్దపల్లి జంక్షన్‌లో కొత్తగా ప్రారంభించనున్న గ్వాలియర్ 11085/86 వీక్లీ ఎక్స్ ప్రెస్ రైలుతోపాటు పలు ప్రధాన ఎక్స్‌ప్రెస్‌లకు స్టాప్ సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

